www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్

ట్రిపుల్ఐటి విద్యార్థిని ఆత్మహత్య

ఉరేసుకుని మృతిచెందిన విద్యార్థిని, మంగిర అఖిల (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆర్‌జెయుకెటి ఇడుపులపాయి ట్రిపుల్ఐటిలో ఇ-4 చదివే ఇంజినీరింగ్ విద్యార్థిని మంగిర అఖిల (22)ఆత్మహత్య చేసుకొంది. విద్యార్థులు, అధికారుల సమాచారం మేరకు.. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలోని బోగంపల్లెకు చెందిన యోగాంజనేయులు, విజయ కుమార్తె మంగిర అఖిల ట్రిపుల్ఐటిలో ఇ-4 (చివరి సంవత్సరం) ఎలక్ట్రానిక్ కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతుంది. సోమవారం ఉదయం దాదాపు 9 గంటల మధ్యలో తల్లిలో మాట్లాడింది. గదిలో ఎవరూ లేని సమయంలో కిటికీకి చున్నితో మెడకు చుట్టుకుని ఆత్మహత్య చేసుకుది. మృతురాలి తండ్రి బతుకు దెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. చదువులో బాగా రాణిస్తున్న అఖిల ఉన్నటుండి ఆత్మహత్యకు పాల్పడంతో సహ విద్యార్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. హాస్టల్ రూమ్‌లో అఖిలతోపాటు మరో ఇద్దరు విద్యార్థినులున్నారు. తన తల్లితో ఫోన్‌లో మాట్లాడిన తరువాత పాఠశాలకు వెళ్లేందుకు డ్రెస్ వేసుకుంది. గదిలో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకుని కిటికీకి చున్నితో ఉరివేసుకుంది. లీజర్ సమయంలో తోటి విద్యార్థులు గదికి వచ్చి తలుపు కొట్టగా తీయకపోవడంతో వెంటనే సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది తలుపులు తీయగా అఖిల కిటికీకి ఉరేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. హుటాహుటీనా తోటి విద్యార్థులు మెడకు ఉన్న చున్నిని తొలగించి కిందకు దింపగా అప్పటికే విద్యార్థిని మృతిచెందింది. వెంటనే విసి విజయ్‌కుమార్, డైరెక్టర్ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రంగారావు, తిరుమలనాయక్ వచ్చి పరిస్థితి సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థి సెల్‌ఫోన్, లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని తోటి విద్యార్థులను ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో వేంపల్లె ఆస్పత్రికి తరలించారు. అధికారులు విద్యార్థి తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వేంపల్లె ఆస్పత్రికి వెళ్లి కుమార్తె మృతదేహం వద్ద బోరున విలపించారు. కుటుంబ సమస్యలతో మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు డైరెక్టర్ సంధారాణి చెప్పారు. ఇదీలా ఉండగా తమకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవని, కష్టపడి ఇద్దరు పిల్లల్ని చదించుకుంటున్నామని మృతురాలి తల్లి పేర్కొన్నారు. ఇద్దరు పిల్లల్లో అఖిల పెద్దమ్మాయి అని, కొడుకు బిటెక్ చదువుతున్నాడని తెలిపారు. క్షణికావేశంలో విద్యార్థులు ఇలాంటి ఆత్మహత్యలకు పాల్పడ్డం తల్లిదండ్రుల క్షోభకు గురి చేస్తుందని ట్రిపుల్ఐటి డైరెక్టర్ పేర్కొన్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు చెప్పారు.

'ఉక్కు' ఆశలకు రెక్కలు

- జిల్లా ప్రజల కలలు సాకారం
- నిర్మాణానికి రూ. 8,800 కోట్లు కేటాయింపు
- రేపు సిఎం జగన్‌చే పనులు ప్రారంభం

కడప జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న ఉక్కుకర్మాగారం ఏర్పాటుకు పునాది పడనుంది. ఉక్కు పరిశ్రమపై జిల్లా నిరుద్యోగ యువత పెట్టుకున్న ఆశలు సాకారం కానుంది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్ విజయవాడలో నిర్వహించిన ఓ సమావేశంలో జిందాల్ (జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అందుకు రూ. 8,800 నిధులు కూడా కేటాయించారు. ఎన్నికల హామీలలో భాగంగా మూడేళ్లల్లో కడప ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తామని బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. 2019లో శంకుస్థాపన చేశారు. తరువాత పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు ఈనెల 15న సిఎం చేతుల మీదుగా ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించనుండడంతో జిల్లా వాసుల్లో ఆశలు చిగురించాయి.

ప్రజాశక్తి-జమ్మలమడుగు/ రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా వాసి కావడంతో తన తండ్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కలను సాకారం చేయడంలో ముందు ఉంటారని అందరూ భావించారు. 2019 ఎన్నికల హామీల్లో భాగంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అదే ఏడాది ఆయన డిసెంబర్ 26న ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఆనాటి నుండి నేటి వరకు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. దీంతో కడప జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొంది. దాదాపు మూడేళ్ల తరువాత 2022 డిసెంబర్ 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడిల ప్రోత్సాహక మండలి సమావేశంలో కడప జిల్లా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్‌ను ఒప్పించి స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. 2019లో రాష్ట్ర బడ్జెట్లో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ .250 కోట్లు నిధులను కేటాయించారు. మొదటి బడ్జెట్ లోనే కడప ఉక్కు పరిశ్రమను ప్రస్తావించడంతో జిల్లా ప్రజలు, నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఆ నిధులతో కేవలం భూ సేకరణ పనులు మాత్రమే చేపట్టారు. మూడేళ్లయినా స్టీల్‌ప్లాంట్ పనులు ముందుకు సాగక పోవడంతో నిరుద్యోగులలో నిరాశ నిస్పృహ నెలకొంది. 2007 జూన్ 10న అప్పటి ముఖ్యమంత్రి, కీ.శే.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ జమ్మలమడుగు ప్రాంతంలోని చిట్టిమీట చింతల సమీపంలో నిర్మాణం చేపట్టారు. అప్పటి ప్రభుత్వం బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించింది. ఎయిర్ పోర్టు నిర్మాణానికి మరో 3200 ఎకరాలనూ కేటాయించింది. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ పనులు దాదాపు 40 శాతం పనులు కూడా పూర్తి అయ్యాయి. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ యజమాని గాలి జనార్దన్ రెడ్డి జైలుపాలు కావడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పటి నుంచి జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఏ ముఖ్యమంత్రి ప్రయత్నం చేయలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అలాంటి ప్రయత్నమే చేయలేదు. వై.ఎస్. కాంగ్రెస్ పార్టీ 2019లో ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాలో చదువుకున్న ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉపాధి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఈనెల 15న మండల పరిధిలోని కన్యతీర్థం సమీపంలో జిందాల్ ఆధ్వర్యంలో సిఎం ప్రారంభించబోయే పనులు సకాలంలో పూర్తయి నిరుద్యోగుల ఆశలు నెరవేరుతాయో లేదో వేచి చూడాలి.

అధికారులు ఏర్పాటు చేసిన జర్మన్ హ్యాంగర్ డాబా

ఏర్పాట్ల పనులు ముమ్మరం

ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించబోయే స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కేవలం 500 మందితో భూమి పూజ చేపడతున్నారని తెలుస్తోంది. ఆ మేరకు జర్మన్ హ్యాంగర్ అనే కొత్త డాబాను ఏర్పాటు చేశారు. మరో వైపు స్టీల్‌ప్లాంట్ కోసం డికెటి భూములు కొనుగోలు చేసిన వారికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాల్లో భూములు ఇచ్చిన సిరిగేపల్లి, పెద్దదండ్లూరు, సున్నపురాళ్లపల్లె గ్రామస్తులతోపాటు స్థానికులకే మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు.

'అప్పర్ భద్ర'ను ఆపాల్సిందే

- కలెక్టరేట్ వద్ద నిరసనలో అఖిలపక్ష నాయకుల డిమాండ్

నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్ష నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

కర్ణాటకలో తుంగభద్రా నదిపై కడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆపాల్సిందేనని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసే పరిస్థితి ఉందని అనుమానాన్ని వ్యక్తపరిచారు. రాయలసీమ వాసులమని వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ఆయన కుమారుడు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఓట్లు కొల్లగొట్టి చివరకు ఈ ప్రాంత ప్రజలకే తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. పాదయాత్రలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు తెస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చి మరిచారని మండిపడ్డారు, కేసీ కెనాల్, గండికోట, మైలవరం, అన్ని ప్రాజెక్టులకు తుంగభద్ర కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి నిధులు ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ వివేక హత్య కేసు నుంచి బయటపడడానికి ప్రధాని మోడీకి దాసోహంగా మారారని విమర్శించారు. రాయలసీమకు నీటి కష్టాలు తెచ్చే అప్పర్ భద్రను ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ మాట్లాడుతూ అప్పర్ భద్ర నిర్మాణం వల్ల నీటి పరిమాణం పడిపోతుందని, రాయలసీమలో ఎనిమిది లక్షల ఎకరాల్లో పంట సాగు అవుతుందని, నీటి అవసరం ఉందని చెప్పారు, ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి కృష్ణ నదికి నీరు రాకుండా చేశారని గుర్తు చేశారు. ఎన్నికల రాజకీయం కోసం కేంద్ర ప్రభుత్వం భద్రకు నిధులు విడుదల చేసిందని విమర్శించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమకు అన్యాయం జరిగే ప్రాజెక్టు అప్పర్ భద్ర అన్నారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇచ్చిందని, ముఖ్యమంత్రి జగన్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశపరిచి, అడ్డుకునే ప్రయత్నాలు చేయకపోవడం సీమకు అన్యాయం చేకూర్చే విధంగా ఉందని చెప్పారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అప్పర్ భద్ర ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, నగర కార్యదర్శి రామ మోహన్ మాట్లాడుతూ అనాదిగా రాయలసీమకు అన్యాయమే జరుగుతుందని, సీమ వాసులు రాష్ట్రానికి ముఖ్యమంత్రులు అయినప్పటికీ సీమ అభివృద్ధికై దృష్టి సారించలేదన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కలిసికట్టుగా పోరాడతామని హెచ్చరించారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టు వల్ల సీమ ఎడారిగా మారుతుంది అన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయాలకు అతీతంగా రాయలసీమ హక్కుల కోసం ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలి

కడప : జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను సమూలంగా నిషేధించి మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జిల్లాలో మత్తు మందుల నివారణ, అక్రమ రవాణా నిరోధంపై కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వారిగా స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారి ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి మెడికల్ షాప్‌లోనూ సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. . నిషేధిత మందుల అమ్మకాలను అరికట్టడంతో పాటు, '18 ఏళ్లలోపు బాలలకు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులు ఇవ్వబడవు' అనే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వినియోగంపై పర్యవేక్షించాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాల్య వివాహాలను అరికట్టే చర్యలను తీసుకోవడంతో పాటు ఎక్కడైనా బాలల అపహరణ జరిగితే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు చేసేవారిపై ఎఫ్ఐఆర్. నమోదు చేయించాలని పేర్కొన్నారు. రిమ్స్ ప్రాంగణంలోని సఖీ సెంటర్‌లో డి.అడ్డిక్షన్ సెంటర్‌ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జెసి సాయికాంత్ వర్మ, కమిషనర్ సాయిచంద్, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్. రాణి, మెప్మా పీడీ రామ్మోహన్ రెడ్డి డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ కె. నాగరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయ ప్రకాష్, సిపిఓ వెంకట్రావు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, పోలీస్ అధికారులు, సఖి సెంటర్ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి : జెసి

కడప : గృహ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని జెసి సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసిజగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఒటిఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు-పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒ వెంకట రమణ, వెంకటేష్, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

సాధన ద్వారానే అభ్యసనాభివృద్ధి

కడప అర్బన్: సాధన ద్వారానే అభ్యసనం మెరుగు అవుతుందని కడప ఎంఇఒ పాలెం నారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కసాయి వీధి , అమీన్ పీర్ రోడ్ , 11వ, 12వ వార్డు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు, కృష్ణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి సాధన అలవాటు చేసుకుంటే అభ్యసన మెరుగవుతుందని చెప్పారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అధిక సాధన ఇవ్వడం ద్వారా అభ్యసన స్థాయిలను మెరుగుపరచాలని చెప్పారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులతో ముఖాముఖి ద్వారా విలువైన సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిఆర్‌పి ఆదిమూలం శంకర్, పాఠశాలల ఉపాధ్యాయులు మహమ్మద్ దావూద్, అహ్మద్‌బాషా, ఉమా చంద్రిక, రేణుక పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

వల్లూరు : ఎస్‌జిఎఫ్ అండర్ -19 రాష్ట్ర సైక్లింగ్ పోటీల్లో వల్లూరు మండలం గంగాయపల్లి ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె. వాసంతి ద్వితీయ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నర్సారావు పేటలో నిర్వహించిన ఎస్‌జి ఎఫ్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం కళాశాలకు మంచి ప్రఖ్యాతలు తీసుకొచ్చారని చెప్పారు. అనంతరం ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్ సుశీలమ్మ విద్యార్థిని అభినందించారు.



ప్రతిభ సాధించిన విద్యార్థి వాసంతి

ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ఉపసంహరించాలి

14న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్

ప్రజాశక్తి-చెన్నూరు

విఆర్ఎ జీతాలకు, ఉద్యోగాలకే ఎసరు పెట్టే ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విఆర్ఎల హాజరు విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు విఆర్‌కు ఉద్యోగాలకే కోత పెట్టేలా ఉందని పేర్కొన్నారు. ఫెషియల్ విధానంలో ఎవరి సెల్‌ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫొటో తీసి ప్రభుత్వం రూపొందించిన యాప్‌ద్వారా హాజరు పంపాలనడం శోచనీయమన్నారు. విఆర్ఎలు అత్యధిక మంది చదువు రాని వారు ఉన్నారని, అందులోని అత్యధిక మందికి స్మార్ట్‌ఫోన్లు కూడా లేవని వాపోయారు. ప్రభుత్వం చెప్పినట్లు హాజరు పంపకపోతే రోజంతా పనిచేసిన వృథా అవుతుందని చెప్పారు. వరుసగా 4 -5 రోజులు హాజరు పడకపోతే పని దొంగ కింద లెక్క కట్టి ఉద్యోగం తొలగించే ప్రమాదముందని వాపోయారు. కొత్త విధానంలో పండగలు, ఇతర సెలవులు కూడా వర్తించవని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం నూతన విధానానికి స్వస్తి పలకాలన్నారు. విఆర్ఎలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విఆర్ఓలో సమస్యలపై ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని గ్రామ రెవెన్యూ సహాయకులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వై .కేశవ, నాయకులు నాగేంద్ర ,అశోక్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

కడప : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా, నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కడప ఆర్డీవో పి. ధర్మచంద్రారెడ్డి, బద్వేలు ఆర్డీవో వెంకట రమణ, ఎస్ఎస్ఎ పిఒ ఎ. ప్రభాకర్‌రెడ్డి సంయుక్తంగా ఎన్నికల నిర్వహణ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో పట్ట భద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ టీమ్ సిబ్బందికి మోడల్ కోడ్ అమలు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్లుగా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప ఆర్డీవో మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికలను ఎలా సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేశారో. అదే స్ఫూర్తితో ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా శిక్షణలో తెలుసుకోవాలన్నారు. 'మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్" విధిగా పాటించాలన్నారు. ఎస్ ఎస్ఎ పిఒ మాట్లాడుతూ ఎన్నికల విధులను కేటాయించిన అధికారులకు వేర్వేరు బాధ్యతలకు సంబంధించి వేర్వేరు వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి రోజువారీ విధుల సమాచారాన్ని అందులో షేర్ చేసుకోవాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డిలు, మండలాల ఇఇలు, వ్యవసాయ విస్తరణ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 15 నుంచి 21 వరకు సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ డైరెక్టర్ జీవ విలియమ్స్, కోశాధికారి డాక్టర్ ఎం. సి. వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం ఆఫీసర్స్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయస్సు కల్గిన వారికి నిర్వహిస్తామన్నారు. పోటీలు కడప ఆఫీసర్స్, యునైటెడ్ క్లబ్బులు, మున్సిపల్ స్టేడియంలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. బహుమతులు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, అరుణాచల ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో అందిస్తున్నామని తెలిపారు.

డాక్టర్ తవ్వా వెంకటయ్యకు ఘన సత్కారం

కడప అర్బన్ : ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్య అధికార భాషా సంఘం సభ్యులుగా నియామకం పొందిన సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పలు సాహితీ సంస్థలు కలసి సోమవారం ఉదయం సన్మానించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, జానమద్ది సాహితీ పీఠం, డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

యు టిఎఫ్ జిల్లా నూతన కమిటీని ఆదివారం నగరంలోని యు టిఎఫ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్.నాగార్జున రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మాదన విజయ కుమార్, సహాధ్యక్షులుగా వై.రవి కుమార్, డి.సుజాత రాణి, ప్రధాన కార్యదర్శిగా పాలెం మహేష్ బాబ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎస్.దావుద్దీన్, కార్యదర్శులుగా జెడ్.జయరామయ్య, చెరుకూరి శ్రీనివాసులు, వై.మస్తానయ్య, డి.వి.రవీంద్రుడు, డి.గురు ప్రసాద్, సి.వి.రమణ, వి.పర్వీన్, ఎస్.ఏజాక్ అహ్మద్, వి.మురళీకృష్ణ, కె.చెన్నయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెం మహేష్ బాబు, మాదన విజయకుమార్, డి.రూతు ఆరోగ్య మేరీ, ఎస్.ఓబుల్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా కె.నరసింహారావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా యస్.శశిధర కుమార్, ఎం.సుందరం, జి.రవిశంకర్, టి.వి.రమణ,రఫిక్ అహ్మద్, సీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా సి.సుదర్శన్, కో-కన్వీనర్లుగా పి.కిరణ్ కుమార్, ఎస్.కరీముల్లా, ఎన్. పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా పరిశీలకులుగా, మరో రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని చెప్పారు.

యూనివర్సిటీలో లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి

కడప అర్బన్ : యోగివేమన యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ లా ని ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ కోరారు. సోమవారం పాత బస్టాండ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో అన్ని విభాగాలకు డిపార్టుమెంటులున్నాయని, లా డిపార్ట్మెంట్ లేదని తెలిపారు. దీని ద్వారా ప్రతి సంవత్సరమూ ఇయర్ అఫ్ క్యాలెండర్ లేక సెమిస్టర్ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో ఎదురు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. లా ఎంట్రెన్స్ ,కౌన్సిలింగ్ ఇవన్నీ ప్రతి సంవత్సరమూ ఆలస్యంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సెమిస్టర్ పరీక్షల్లో వందల మంది రాస్తే పదులలో పాస్ అవుతున్నారని తెలిపారు.నూటికి 18 శాతం కూడా పాస్ అవ్వడం లేదని అన్నారు. యూనివర్సిటీ నిర్వహణ లోపం కారణంగా చేత లా విద్యార్థుల భవిష్యత్ దారుణంగా తయారు అవుతున్నది అన్నారు. సమావేశంలో రాహుల్, పవన్ పాల్గొన్నారు.

సరోజిని నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి

ప్రజాశక్తి - కడప

కవయిత్రి సరోజినీ నాయుడు 144వ జయంతి వేడుకలను జాతీయ మానవ హక్కుల న్యాయవాది షేక్ అమీన్ పీరా ఆధ్వర్యంలో కడప నగరంలోని తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమీన్ పీరా మాట్లాడుతూ సరోజినీ నాయుడు జయంతిని 'జాతీయ మహిళాదినంగా' నిర్వహించుకుంటున్నామని చెప్పారు. స్వతంత్ర దేశంలో తొలి మహిళా గవర్నర్‌గా ఎన్నిక య్యారన్నారు. **ప్రభుత్వ పురుషుల కళాశాలలో..** మహిళా అభివృద్ధికి, స్వతంత్ర సాధనకు గొప్ప కృషి సల్పిన ధీర వనిత సరోజినీ నాయుడు అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలలో సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ వెంకటలక్ష్మి, శివపార్వతి, డాక్టర్ శాంతిలత, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రమ్య జ్యోతి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ రాజీవ్ బాబు పాల్గొన్నారు.

తేక్వాండోలో పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : తిరుపతిలో ఈనెల 11,12 తేదీలలో నిర్వహించిన 1వ ఓపెన్ సౌత్ జోన్ తేక్వాండో ఛాంపియన్‌షిప్ -2023లో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా పోటీలో 4 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. షేక్. నూర్ బాషా, షేక్. ఇబ్రహీం 4 వ తరగతి, షేక్. మహమ్మద్ రిహాన్ 9వ తరగతి, మహమ్మద్ అలీఖాన్ 8వ తరగతి గోల్డ్ మెడల్స్ సాధించారని చెప్పారు. షేక్. ఫర్హాన్, షేక్. ఖాజా మోహినూద్దీన్, సయ్యద్. మహమ్మద్ ఫర్హాన్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించాలని తెలిపారు. మన్సూర్ కరాటే మాస్టర్ మన్సూర్‌ను పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ అభినందించారు.

గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పీస్ విద్యార్థులు

విజేలతో కెఎస్ఆర్ఎం ఎమ్‌డి, ప్రిన్సిపల్

సాఫ్ట్‌టెన్నీస్‌లో కెఎస్ఆర్ఎం విద్యార్థుల హవా

కడప అర్బన్ : జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12వ తేదీలలో కడప మున్సిపల్ గ్రౌండ్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలలో కెఎస్ఆర్ఎం విద్యార్థులకు తృతీయ స్థానంలో గెలుపొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి తెలిపారు. సోమవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు గెలుపొందిన విద్యార్థులు బాలురు ఉదయ్ కుమార్, మన్సూర్, హరి, అజయ్ కుమార్, మౌళి, బాలికల నుంచి మహాలక్ష్మి, అనిత, పూర్ణిమ, భార్గవి, నాగాంజలి. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ వంశీ నాయక్, నారాయణ పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

కడప అర్బన్ : కేంద్ర కారాగారంలో ఉన్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఖాదరవల్లి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎయిడ్స్ నివారణ కోసం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, హెచ్ఐవి, సిఫిలిస్, హైపటైటీస్ బి,సి సమాచారాన్ని సేకరించుటకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎంపిక చేసిన కేంద్రకారాగారాలలో మాత్రమే రెండేళ్లకు ఒకసారి పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 400 మంది ఖైదీలను పరీక్షిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్, జైలు మెడికల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉద్యోగ బాధ్యత అధ్యాపకులదే

కడప : విద్యార్థులు విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందడంలో అధ్యాపకులదే కీలక పాత్ర అని యోగివేమన యూనివర్సిటీ కులసచివులు (రిజిస్ట్రార్) ఆచార్య డాక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) నూతన సంవత్సర డైరీని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రధాన ఆచార్యులు డా.జి రవీంద్రనాథ్‌తో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిసిటిఎ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు శశికాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ నీలయ్య, జోనల్ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామకృష్ణ, అధ్యాపకులు నాగేశ్వర్ రెడ్డి, శివ పార్వతి, అనిత, రేఖారాణి, నరసింహారావు పాల్గొన్నారు.

రాష్ట్రానికే తలమానికం సైన్స్ ఫెయిర్ : డిఇఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రానికే తలమానికమని జిల్లా విద్యాధికారి దేవరాజ్ అన్నారు. పట్టణంలోని అహోబిలపురం ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పిదా పాఠశాలల నుంచి 150 సైన్స్ నమూనా ప్రదర్శనను తయారు చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ వీరారెడ్డి మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక కార్యక్రమం పులివెందులలో జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ఎంఇఒలు, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజ్ఞాన వైజ్ఞానిక ప్రదర్శన అధికారి మహేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి దేవరాజ్

జడ్‌పి హైస్కూల్ వద్ద కల్వర్టు నిర్మించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని జిల్లా పరిషత్ మార్కెట్ హైస్కూల్ ముందు విద్యార్థులు వెళ్లే కాలువపైన కల్వర్టు నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన కడప స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు కాలువపైన కల్వర్టు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై గత డిసెంబర్‌లో కలెక్టర్ జమ్మలమడుగుకు వచ్చిన సందర్భంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారన్నారు. రెండు నెలలు దాటుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

'స్పందన'లో వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్

రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలో మరొక రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప తర్వాత వ్యాపార, వైద్య పరంగా ప్రొద్దుటూరు ఎంతో పేరొందిందన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి, ప్రయివేట్ బ్లడ్ బ్యాంకు మరొకటి ఉందన్నారు. జనాభాకి తగ్గట్టు మరొక రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, స్టార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, మైదుకూరు పట్టణానికి చెందిన అమ్మా సేవా సంస్థ నిర్వాహకులు శంకర్, నేస్తం సేవా సంస్థ అధ్యక్షుడు కొండారెడ్డి, ఖాజీపేటకు చెందిన మీకోసం సేవా సంస్థ నిర్వాహకులు విష్ణువర్ధన్, తిప్పలూరు గ్రామానికి చెందిన ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమ నిర్వాహకులు నాగేంద్ర పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో పోస్టల్ పథకాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేద, మధ్య తరగతి కుటుంబాలకు పోస్టల్ పథకాలు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా తమ భవిష్యత్, బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశం ఉందని పోస్టల్ సూపరింటెండెంట్ కె.పి. రవిబాబు తెలిపారు. స్థానిక పోస్టల్ కార్యాలయంలో సోమవారం పోస్టల్ సిబ్బంది ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ పిల్లల జీవితానికి ఆర్థిక భరోసానిచ్చే అద్భుత పథకం సుకన్య సమృద్ధి యోజన అని తెలిపారు. ఆడ పిల్ల పుట్టిన పట్టణంలోని సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. రూ.250తో ఖాతా తెరవవచ్చన్నారు. అనంతరం సుకన్య సమృద్ధి యోజన పథక కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ పోస్టల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, పోస్టల్ ఉద్యోగి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పోస్టల్ అధికారులు

క్రైం కార్నర్

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని శంకరాపురం గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం బైకును ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటనలో టంగుటూరు గురుస్వామి(46) అనే వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు. వెనుక కూర్చున్న జల్లా రామాంజనేయులు(38) తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. మోడంపల్లి దళితవాడకు చెందిన జల్లా రామాంజనేయులు డ్వాక్రా గ్రూపులోని తొమ్మిది మంది సభ్యులు వారి భర్తలతో కలిసి జమ్మలమడుగుకు స్పందన డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమై మహిళలు ఆటోలో వస్తుండగా, వారి భర్తలు మోటారు సైకిల్‌పై బయల్దేరారు. శంకరాపురం వద్దకు రాగానే బస్సు ఎదురుగా వచ్చి గురుస్వామి, రామాంజనేయులు వస్తున్న బైకును ఢీ కొంది. దీంతో రాజుపాలెం మండలం టంగుటూరుకు చెందిన గురుస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. గురుస్వామి ప్రస్తుతం మోడంపల్లె దళితవాడలోనే ఉంటున్నారు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. గురుస్వామికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. రామాంజనేయులుకు ఒక కుమారుడు. ఒక కుమార్తె. రామాంజనేయులు లక్ష్మీనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి కారణమైన ఆర్‌టిసి బస్సు

రూ.89 లక్షలతో భర్త పరార్.. భార్య ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న జానపాటి లక్ష్మీ నరసింహులు రూ.89 లక్షలతో పరారైన ఘటన వెలుగు చూసింది. ఈ పరిస్థితుల్లో వేధింపులు తట్టుకోలేక అతని భార్య నాగలక్ష్మి ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. పది రోజులు క్రితం పట్టణంలోని రామిరెడ్డి పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జానపాటి లక్ష్మీ నరసింహులు రూ.89 లక్షలతో ఉడయించాడు. పెట్రోల్ బంక్ యజమాని డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తన భర్తపై, తన కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నాగలక్ష్మి పేర్కొంది. నాటినుండి పెట్రోల్ బంక్ యజమాని డబ్బులు చెల్లించాలని వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆమె ఆరోపించారు. తన భర్త కుటుంబ సభ్యులకు డబ్బులతో ఎలాంటి సంబంధం లేదని లెటర్ రాసినప్పటికీ. పెట్రోల్ బంక్ యజమాని పదేపదే వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. తన భర్త జానపాటి లక్ష్మీ నరసిం హులు ఆన్‌లైన్‌లో జూదం ఆడి డబ్బులను పోగొట్టాడని నాగలక్ష్మి పేర్కొంది. తన భర్త చెడు వ్యసనాలకు గురై తమ కుటుంబం ఇప్పటికే అనేక ఆర్థిక ఇబ్బం దులతో సతమతమవుతోందని విలపించింది. విషద్రావణం తాగిన నాగలక్ష్మి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు నిష్పా క్షికంగా విచారించి తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరుతోంది.

జమ్మలమడుగుపై సిఎంకు ప్రత్యేక శ్రద్ధ : ఎంపీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు మండల పరిధిలోని కన్యతీర్థం సమీపంలో నిర్మించనున్న వైఎస్ఆర్ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఈనెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు ప్లాంట్ నిర్మాణ ప్రదేశాన్ని సోమవారం ఎంపీ, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి జిందాల్‌తో ఒప్పందం మేరకు ఈనెల 15న సిఎం జగన్ భూమిపూజ చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ఉన్నప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. జమ్మలమడుగుపై ముఖ్యమంత్రికి ప్రత్యేకశ్రద్ధ ఉందన్నారు. కరోనా మహమ్మారితో మూడేళ్ల నుండి ఆర్థికంగా ఎన్నో కష్టనష్టాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఇక వేగవంతంగా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ నిర్మాణంతో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి కలలుగన్న ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఇకపై వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, పార్టీ సీనియర్ నాయకులు రిషికేశ్వర్‌రెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి, మంగదొడ్డి సింగరయ్య, ఎంపిటిసి వేపరాల కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చెముళ్లపల్లెలో విషజ్వరాలు.. ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని చెముళ్లపల్లె గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటితో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా గ్రామంలో జ్వరాలు వస్తున్నాయని, ఎంతకీ తగ్గకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పిల్లలు ఎక్కువగా జ్వరాలు బారిన పడుతున్నారని తెలిపారు. డెంగీ జ్వరాలుగా వైద్యులు నిర్ధారిస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన రెడ్యం వెంకటనారాయణరెడ్డి, వరలక్ష్మి దంపతుల చిన్నారి కర్నూల్లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో డెంగీ జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఇప్పటికే దాదాపు రూ.50వేలు వరకు ఖర్చయిందని తల్లిదండ్రులు తెలిపారు. జ్వరాలు వస్తున్నా అధికారులు తగు చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జ్వరాల పట్ల వైద్య శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల వైద్యాధికారి ముబీన్‌ను సోమవారం వివరణ కోరగా.. చెముళ్ల పల్లెలో జ్వరాలు వస్తున్నాయనే విషయం తమ దృష్టికి రావడంతో చర్యలు చేపట్టామన్నారు. తక్షణమే వైద్య శిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. విష జ్వరాలను అదుపు చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు.

పేదల పట్ల పోలీసుల తీరు సరికాదు : సిపిఎం

మాట్లాడుతున్న జి.శివకుమార్

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో ఆదివారం పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్‌తో కలిసి జి.శివకుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7గంటల సమయంలో పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో స్థానిక ఎస్ఐ మద్దిలేటి తన సిబ్బందితో వచ్చి వీధి, వీధి తిరిగి 15 మోటర్ సైకిళ్లు, బైకులు తీసుకెళ్లారని తెలిపారు. ఇళ్ల దగ్గర ఉన్న మోటర్ బైక్‌లను తీసుకెళ్లడం అన్యాయమన్నారు. కాలనీ ప్రజలు అడగ్గా స్టేషన్ దగ్గరకు వచ్చి తీసుకెళ్ళమని ఎస్ఐ చెప్పడం దారుణమన్నారు. దొంగల నివాసాల మీద దాడి చేసినట్లుగా ఎస్ఐ పేదల కాలనీ మీదకు ప్రజలు నిద్రలో ఉండగా తన సిబ్బందితో రావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సుందరయ్య కాలనీలో నివాసం ఉన్నవారు అత్యంత పేదలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, శనివారం సంతలో పనిచేసేవారు, వ్యవసాయ కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోజువారీ కూలీలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరు 10, 15, సంవత్సరాల క్రితం మోటార్ సైకిళ్లను (సెకండ్ హ్యాండ్) కొనుగోలు చేసి వాడుకుంటున్నారని, ఈ వాహనాలను ఎస్ఐ తన సిబ్బందితో వచ్చి తీసుకెళ్లడం అన్యాయమన్నారు. రోడ్డుమీద బైక్‌లు ఆపి రికార్డ్స్ లేకుంటే చలానా వేయడం సర్వసాధారణమన్నారు. ఇలా కాలనీ మిదికొచ్చి ఇళ్ల దగ్గరున్న బైక్‌లను తీసుకెళ్ళి పోలీస్‌స్టేషన్ దగ్గర రూ.500, రూ.1000 వంతున జరిమానా విధించడం అన్యాయమన్నారు. జరిగిన సంఘటనను ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు రాయప్ప, రవి, బాబు, పోలయ్య పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరించాలని మహిళల నిరసన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తమ కుటుంబాలకు కరెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు సోమవారం పురుగు మందు డబ్బాలను చేత పట్టుకొని పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శిరీష, లక్ష్మీదేవి మాట్లాడుతూ రెండు నెలల నుంచి ధర్మాపురం గ్రామంలో 30 కుటుంబాలకు కరెంటులేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. చాలా ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన కరెంటు స్తంభం విరిగి పడిపోయిందని, దాన్ని ఇప్పటివరకు సరి చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, పెద్దలు రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమలు అధికంగా ఉన్నాయని, వీటివల్ల అనారోగ్యానికి గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విషపురుగులు కూడా అధికంగా తిరుగుతున్నాయని వాపోయారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే అధికారులే బాధ్యత వహించాలన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేసి, కరెంట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు తమ గ్రామంలో పర్యటించినప్పుడు ఈ సమస్యను తెలిపినా, పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు.

పురుగు మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కోసం కష్టపడే కార్యకర్తలకు అధిష్టానం గుర్తింపునిస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెకు చెందిన మాజీ వార్డు మెంబరు పూల అల్లాబక్షుకు కడప పార్లమెంటు టిడిపి జిల్లా మైనార్టీ కార్యదర్శిగా నియమిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం పార్టీ మండల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మైనార్టీ జిల్లా కార్యదర్శి పూల అల్లాబక్షు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా టిడిపి కోసమే పని చేసినందుకు గుర్తించి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, పాపిరెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, మహమ్మద్ ఇనాయతుల్లా, ఇలియాస్, డక్కా రమేష్, వీరబద్ర, గొగుల మల్లికార్జున, గొగుల మారుతి, ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, గౌస్, గంగాధర్, వెంకటయ్య, మహబూబ్ షరీఫ్, కొండూరు వెంకటశివ, గౌస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాయంతో పాటు ప్రేమను పంచాలి

జమ్మలమడుగు రూరల్ : ఆపదలో ఉన్న వారికి సహాయంతోపాటు ప్రేమను పంచాలని సిఎస్ఐ రాయలసీమ డయాసిస్ ఐజాఖ్ వరప్రసాద్ సూచించారు. స్థానిక సియస్ఐ క్రైస్ట్ టౌన్ చర్చి 16వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సియస్ఐ రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్.రెవరెండ్ పి.ఐజాక్ వరప్రసాద్, భారతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిషప్ ఐజాక్ వరప్రసాద్ మాట్లాడుతూ శాంతి, సమాధానం, సాటి మనుష్యులకు సహాయంతోపాటు, ప్రేమను అందించాలన్నారు. బిషప్ ఐజాక్ వరప్రసాద్, భారతిని ఘనంగా సన్మానించారు. సంఘం సభ్యులు మధుకుమార్, జయరాజు, యేసుదాసు, భాస్కర్, శ్యాంబాబు, ప్రదీప్, జ్యోతి రాజశేఖర్, జెస్సీరోజ్ ప్రభావతి, కెజియా ధనపాల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డివిరుస్తున్న ప్రభుత్వాన్ని దించాలి

ఎర్రగుంట్ల : నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి కోరారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో సోమవారం ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. పేద, బడుగు బలహీన వర్గాల్లో వెలుగు రావాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మార్చిలో జరిగే పట్టభద్రుల శాసనమండలి ఎలక్షన్లలో టిడిపి తరఫున పోటీ చేయుచున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, కటిక బాలమునెయ్య, బయపురెడ్డి, అంకాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుధాకర్, సాంబశివారెడ్డి, సింగపూర్ గంగిరెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

ఎస్‌సిఆర్‌పి సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌సి రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన యర్రగుడి చంద్రబాబును,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అగిలి సురేష్, జల్లి ఓబులేసు, కైలా రాంబాబు, నాగులారపు ఓబయ్యలను సోమవారం ఘనంగా సన్మానించారు. టిడిపి ప్రొద్దుటూరు పట్టణ మైనారిటీ అధికార ప్రతినిధి కమ్ము బాయ్‌గారి గౌస్‌బాషా, టింబర్ డిపో యజమాని షేక్ అబ్దుల్ ఖాదర్, డిపిఎస్ ప్యాకర్స్ మూవర్స్ యజమాని బండి శ్రీనివాసులు, ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘ కార్యవర్గ సభ్యులు షేక్ హబీబుల్లా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి పంచాయతీ 15వ వార్డు మెంబర్ కుందవరపు బాలయ్య, బలిజ సంఘం నాయకులు ఆర్.నాగప్రసాద్, ప్రొద్దుటూరు స్వర్ణ కారుల సంఘ సభ్యులు. మైనారిటీ నాయకులు షేక్ ఖాజాపూర్, ఎస్‌పి నజీర్, షేక్ గులాం రసూల్, షేక్ మహబూబ్ బాషా, చౌటపల్లి యూత్ పందిటి వినోద్, మేకల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె : వేంపల్లె చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో చేపట్టబోయే ఉచిత డ్రైవింగ్ శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు రామాంజనమ్మ ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ సహకారంతో స్థానిక నిరుద్యోగ యువతకు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 20 రోజులపాటు డ్రైవింగ్‌తోపాటు 10 రోజులు క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణనిస్తారన్నారు. అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్స్, సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. వివరాలకు 88867 67141, 97030 98181 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ఎడారే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ఏడారి ప్రాంతం అవుతుందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాక ప్రతాపరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించిందన్నారు. మొన్నటి బడ్జెట్‌లో రూ.5500 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఈ విషయంలో రాయలసీమ బిజెపి నాయకులు స్పృహలేకుండా ఉన్నారన్నారు. తుంగభద్ర నుండి నీళ్లు కిందికి రాకపోతే రాయలసీమతోపాటు ఆంధ్రప్రాంతం కూడా ఇబ్బంది పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం డ్యాంలో నీళ్లు లేనప్పుడు ఆంధ్రప్రాంతం కూడా తుంగభద్ర డ్యాం ద్వారా లబ్ధి పొందిందని, ఈ సంవత్సరం తుంగభద్ర నీళ్లు శ్రీశైలం డ్యాం నుండి ఆంధ్ర ప్రాంతానికి తద్వారా సముద్రానికి దాదాపు 500 టియంసీ వెళ్లాయని, ఆంధ్ర ప్రాంతంలోని నాయకులు ఈ అప్పర్‌భద్ర డ్యాంను వ్యతిరేకిస్తుంటే రాయలసీమలోని బిజెపి నాయకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించాలన్నారు. లేనిపక్షంలో రాయలసీమ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈ నెల 25 నుండి మూడు రోజుల పాటు రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టున్నట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ ప్రేమికులు పార్టీలకతీతంగా ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రకటన

యావన్మందికి తెలియజేయడమేమనగా నా డాక్యుమెంటేషన్ రిజిస్టర్ పత్రాలు మిస్ అయినవి. బోధన పోయిన నారాయణ ఆయన నేను పోరుమామిళ్ల నుండి వయా కలసపాడు మీదుగా రెడ్డిపల్లె అయిన నా స్వగ్రామ మునకు వెళుచుండగా బస్సులో డాక్యుమెంట్ రిజిస్టర్ పత్రాలు మిస్ అయినవి. రిజిస్ట్రేషన్ నెంబర్ 29 61 వీటిని 2020లో రిజిస్టర్ చేయించడం జరిగింది. కనుక ఎవరికైనా ఈ నెంబర్ గల డాక్యుమెంటేషన్ దొరికి ఉంటే రిజిస్ట్రేషన్ లో ఉన్న అడ్రస్కు పంపించగలరు.

ఇట్లు
చంద్ర ఓబుల్ రెడ్డి,
లాయర్, బద్వేల్

కుష్టు వ్యాధిపై అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ విద్యార్థులకు సూచించారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా ఆర్ఇఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని ప్రజలకు, ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించామన్నారు. కుష్టు రోగులను పరామర్శించి, వారికి అందుతున్న సేవల గురించి వివరించామన్నారు. ఆర్ఇఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, కళాశాల ఎఒ వెంకటరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, ఆశా నోడల్ పర్సన్ అరుణకుమారి, కుష్టు నివారణ నోడల్ పర్సన్ సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, ఎఎన్ఎం శివనాగమణి, ఆశా కార్యకర్త విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైద్య, కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ప్రొద్దుటూరు : కుష్టురహిత సమాజ నిర్మాణానికి అందరం కట్టుబడి ఉండాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి శివశంకరయ్య సూచించారు. జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వైవియస్ బాలినోన్నత పాఠశాలలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యాయులు, సిఒ సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శి కేశమ్మ, బాలికలు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రైతులను విస్మరిస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులను విస్మరించడంతో రాబోవు ఎన్నికల్లో రైతులు బిజెపి, వైసిపిలను ఓడిస్తారని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయం అనుబంధ రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెప్పారు. సమాజంలో 70 శాతం ఉన్నప్పటికీ బడ్జెట్ కేటాయింపులు 2021-22లో 3.97 శాతం, 2022-23లో 3.51 శాతం, 2023-24లో 2.27 శాతమే ఉండడం గర్హనీయమన్నారు. ఎరువుల సబ్సిడీ 2023-24 కేంద్ర బడ్జెట్‌లో రూ.50.120 కోట్లు కోత పెట్టడం సరికాదన్నారు. రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పాలనలో పెట్టిన సున్నావడ్డి పథకానికి వైసిపి ప్రభుత్వం సున్నం పెట్టిందన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు గ్యారంటీ ఇస్తానని చెప్పి ఆ మాటే మరిచినట్లు చెప్పారు. జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ రైతుల ఆత్మహత్యల్లో మూడవ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవ స్థానంలో నిలిచిందని తెలిపారు. రైతుల గురించి ఆలోచించే ఒకే ఒక్క పార్టీ కాంగ్రెస్ మాత్రమే అన్నారు. కాంగ్రెసు అధికారంలోకి వస్తే రూ.3 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయనున్నట్లు తులసిరెడ్డి తెలిపారు.

సత్వరమే నష్టపరిహారం అందేలా చూడాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కోరుకొండ నుంచి అమరావతి వరకు ఆరు వరుసల రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సత్వరమే పరిహారం అందేలా చూడాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాడా కార్యాలయంలో సోమవారం ఆయన ఆర్‌డిఒ వెంకటేశులు, ఆర్‌అండ్‌బి ఇఇ సిద్ధారెడ్డి, అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి మాట్లాడుతూ పార్నపల్లె రోడ్డు నుండి సర్కిల్ వరకు రోడ్ల విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని, అందుకు కోల్పోయే ఇళ్ల పరిహార నివేదికలను వెంటనే ప్రభుత్వానికి పంపించాలన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

16న చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 16న చాపాడు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు. అధికారులు పూర్తి నివేదికను ముందస్తుగా కార్యాలయంలో అందజేయాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే సభ దృష్టికి తేవాలని ఎంపిడిఒ సూచించారు.


జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

మసీదు కమిటీ సభ్యుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు విస్తరణలో భాగంగా మార్కస్ మసీదుకు చెందిన వాణిజ్య గదులకు నష్టం పరిహారం వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మార్కస్ మసీదు కమిటీ, మసీదు ఇమాములు జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న మసీదుకు చెందిన వాణిజ్య గదులకు అధిక మొత్తంలో పరిహారం వచ్చినందుకు వారిని ఘనంగా సన్మానించినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి అవినాష్‌రెడ్డిలు మైనార్టీలపై ఉన్న ప్రేమను చాటుకొనేందుకు వాణిజ్య గదులకు నష్ట పరిహారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మైనార్టీ ప్రజలు సిఎం జగన్‌ను మరిచి పోరని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి షబ్బీర్‌వలి, హజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్, షాదీఖాన్ కమిటీ చైర్మన్ షేక్షావలి, మసీదు కమిటీ చైర్మన్ ఆఫీస్, రఫీ, మహమ్మద్ గౌస్, షాదీఖానా కమిటీ సభ్యులు టైల్స్ మౌలా, చాన్‌బాషా, మాజీ కో-ఆప్షన్ మెంబర్ సాదక్‌వలి, పలువురు మైనార్టీ నాయకులు, మసీదు ఇమాంలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINICPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S. No. 450/2021

R.B.S. Babu, S/o R.P. Babaiah, Hindu, aged years, Residing at Flat No.302, Anjanadri Apartments, A.P.H.B. Colony, Kadapa City, YSR District. **...Plaintiff**

Vs

A. Venkata Narasu, S/o Late A.Sai Prasad, Hindu, aged about 44 years, Business, Residing at D. No. 1/1989, Krishnappa Nagar, Near Railway Station, Kadapa City and District. **...Defendant**

DEFENDANT కు నోటీసు

పై కేసులోని వాది, ప్రతివాది అయిన మీ మీద పై కోర్టులో దావా మొత్తము రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులోని ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారు మీ నోటీసుకు గానూ 17.02.2023వ తారీఖు న 10.30 ని॥లకు మీరు స్వయముగా గానీ మీ తరపున వకీలుగానీ పై కోర్టులో హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షముగా తీర్మాణించబడును అని తెలియజేయడమైనది.

//By Court of Order//

S. NAZEER BASHA
Advocate for Plaintiff,
Kadapa.